# నమస్తే తెలంగాణ

# మహబూబాబాద్

5 | వరంగల్, గురువారం 19 జూన్ 2025 | MAHABUBABAD





## లోపాలు ఇలాగే ఉంటే
# సీట్లు కేటాయించలేం!

- బోధనకు తగ్గట్లు సౌకర్యాలు లేకపోవడంపై ఎన్ఎంసీ అసంతృప్తి
- జనగామ మెడికల్ కాలేజీ నిర్వహణపై ఢిల్లీ నుంచి వర్చువల్ విచారణ
- వసతుల కల్పనలో వైఫల్యంపై ఇప్పటికే షోకాజ్ నోటీసు
- గుర్తింపు రద్దుకు సిఫార్సు చేస్తామని హెచ్చరిక
- ఈ విద్యా సంవత్సరంలో ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపుపై నీలినీడలు?
- సెప్టెంబర్‌లో 3వ సంవత్సరం తరగతులు ప్రారంభం.. ప్రశ్నార్థకంగా విద్యార్థుల భవిష్యత్ ?

ఇప్పటికే రెండేళ్లు పూర్తిచేసుకున్న జనగామ వైద్య విద్య కళాశాల ఈ ఏడాది సెప్టెంబర్ మాసం నుంచి ఎంబీబీఎస్ 3వ సంవత్సరంలో అడుగుపెట్టబోతున్న తరుణంలో ఎన్ఎంసీ తాఖీదులు వైద్య విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారాయి. యూజీఎంఎస్ఆర్–2023 నిబంధనలకు అనుసరించి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అధ్యాపకులు..బోధన సమయంలో సరిపడా రోగులు, ప్రాక్టికల్స్‌కు అవసరమైన పార్థివదేహాలు, రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ఖాళీలు, ఆధార్ అనుసంధానంతో విద్యార్థుల బయోమెట్రిక్ హాజరు విధానం, పలు విభాగాల్లో కనీస మౌలిక సౌకర్యాలు అసలే లేవంటూ ఆధారాలతో సహా ఎన్ఎంసీ ఎత్తిచూపిందని సమాచారం. వీటితో పాటు ఎన్ఎంసీ నిబంధనల మేరకు 420 పడకలకు గానూ ఎంసీహెచ్‌లో 400 బెడ్లు మాత్రమే ఉన్నాయని, సిటీ స్కాన్, ఎమ్మారై సేవలు, పెద్దా, చిన్నా ఆపరేషన్ థియేటర్లు లేవని, డాక్టర్ల సంబంధించి డిక్లరేషన్ సహా ఇతర ఫారంలను నిబంధనల మేరకు పూర్తి చేయడంలేదని ఎత్తిచూపినట్లు తెలుస్తున్నది.

*వైద్య విద్యకు పెద్దపీట వేస్తూ గత బీఆర్ఎస్ సర్కారు ఏర్పాటుచేసిన మెడికల్ కళాశాలలపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, నిర్వహణలో అధికారుల వైఫల్యం విద్యార్థులకు శాపంగా పరిణమిస్తున్నది. ఈమేరకు జనగామ కళాశాలలో విద్యాబోధనకు తగినట్టు సౌకర్యాలు లేవని, నిర్వహణ ఎనిమిది కేటగిరీల్లో లోపాలున్నాయంటూ ఎన్ఎంసీ(జాతీయ వైద్య కమిషన్) అసంతృప్తి వ్యక్తంచేస్తూ ఇటీవల షోకాజ్ నోటీసులిచ్చిన నేపథ్యంలో బుధవారం జనగామ మెడికల్ కళాశాల నిర్వహణపై ఢిల్లీలో వర్చువల్ విచారణ చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కాలేజీలపై జాతీయ వైద్య కమిషన్ తనిఖీ నివేదికల ఆధారంగా అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ బోర్డు(యూజీఎంఈబీ) నిర్వహించిన సమావేశానికి రాష్ట్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి, వైద్య విద్య సంచాలకులు హాజరుకాగా, జనగామ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కూడా వర్చువల్ విచారణకు హాజరయ్యారు. ఎంబీబీఎస్ వైద్య విద్య బోధనకు తగ్గట్లు జనగామలో సౌకర్యాలు లేవంటూ అన్నీ సమకూర్చుకొని లోపాలు సరిచేసుకునే వరకు నూతన విద్యా సంవత్సరం ఎంబీబీఎస్ సీట్లు కేటాయించలేమని అధికారులు స్పష్టం చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అంతేగాక పరిస్థితులు మెరుగుపడకుంటే అవసరమైతే గుర్తింపు రద్దుకు సిఫారసు చేస్తామని కూడా హెచ్చరించినట్లు తెలుస్తుండగా అటు సర్కారు, అధికారుల తీరుతో సీట్ల కేటాయింపుపై నీలినీడలు కమ్ముకొని విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారనున్నది.*

*- జనగామ, జూన్ 18 (నమస్తే తెలంగాణ)*

### పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

గడువు ప్రకారం ఇప్పటికే పూర్తి కావాల్సిన భవన నిర్మాణ పనులు నత్తకు నడక నేర్పుతున్నట్లుగా నేటికీ పూర్తికాలేదు. మరోవైపు కళాశాలకు దూరంగా వసతి గృహాలు ఉండడం.. మెడికోల రాకపోకలకు సరైన వాహనాలు అందుబాటులో లేకపోవడం.. మరోవైపు బోధనా సిబ్బంది కూడా లేక విద్యార్థులు నష్టపోవాల్సి వస్తున్నది. జనగామ ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుబంధంగా జిల్లా ప్రభుత్వ ప్రధాన జనరల్ ఆస్పత్రి సహా చంపక్‌హిల్స్ ఎంసీహెచ్(మాతా శిశు సంరక్ష ఆరోగ్య కేంద్రం) ప్రాంగణంలోని తాత్కాలిక రేకుల షెడ్డుల్లో ఎంబీబీఎస్ ఫస్ట్, సెకండియర్ తరగతులు జరుగుతున్నాయి. పసరుమడ్ల వద్ద ఉన్న అనాథ వృద్ధాశ్రమంలో విద్యార్థినుల హాస్టల్, చంపక్‌హిల్స్ డీఆర్డీవో భవనంలో విద్యార్థుల హాస్టల్ నిర్వహిస్తున్నారు. మెడికల్ కళాశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శలు ఉన్నాయి. పట్టణంలోని గీతాశ్రమం వద్ద పక్కా భవన నిర్మాణ పనులను వేగవంతం చేయడంలో పర్యవేక్షణ కరువైంది.

### రాకపోకలతో సరి

మెడికల్ కళాశాలలో 117 పోస్టులకు గాను 82మంది రెగ్యులర్ ఉద్యోగులు, ఏడుగురు కాంట్రాక్టు ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తుండగా ఇంకా 28 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే ఉన్న పోస్టుల్లో కొందరు హైదరాబాద్ నుంచి ప్రిన్సిపాల్ సహా మరికొందరు హనుమకొండ, వరంగల్ నుంచి రాకపోకలు సాగిస్తుండగా వైద్యుల ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ లేకపోవడంతో వాళ్లు వచ్చినప్పుడే మెడికోలకు పాఠాలు బోధిస్తున్నట్లు తెలుస్తున్నది. అటు అడ్మినిస్ట్రేషన్ విభాగంలో పనిచేసే ఉద్యోగులు కూడా ఇలా వచ్చి అలా వెళ్తున్నారనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా ప్రిన్సిపాల్ కూడా పూర్తిస్థాయిలో కాలేజీకి రాకపోవడంతో ఇటు పరిపాలన, తరగతుల నిర్వహణ గందరగోళంగా మారినట్లు విమర్శలు వస్తున్నాయి.




కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

# రేవంత్ డీఎన్ఏలోనే తెలంగాణ లేదు

**మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి**

ఖానాపురం, జూన్ 18: సీఎం రేవంత్‌రెడ్డి డీఎన్ఏలోనే తెలంగాణ లేదని, అలాంటప్పుడు రాష్ట్ర అభివృద్ధి ఎలా జరుగుతుందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం వరంగల్ జిల్లా ఖానాపురం మండల కేంద్రంలోని రెడ్డి పెద్ద రంగారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన మండలస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో పెద్ది మాట్లాడారు. ఏనాడూ జై తెలంగాణ అనని రేవంత్‌రెడ్డి సీఎం కుర్చీలో కూర్చోవడం ఉద్యమకారులు, అమరులు, 4 కోట్ల మంది ప్రజలకు అవమానమన్నారు. రేవంత్‌రెడ్డి, చంద్రబాబు బుద్ధి ఒకేలా ఉంటుందని, వారు తెలంగాణకు వ్యతిరేకమన్నారు. ఎకరాకు రూ. 15 వేలు రైతు భరోసా ప్రకటించిన కాంగ్రెస్ ప్రస్తుతం రూ. 12 వేలు మాత్రమే ఇస్తున్నదని మండిపడ్డారు. అదికూడా ఎకరాకు రూ. 25 వేలు బాకీ ఉండగా స్థానిక ఎన్నికల కోసం రూ. 6 వేలు మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నదని విమర్శించారు. మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తామని మ్యానిఫెస్టోలో పెట్టి 18 నెలలుగా ఒక్క రుపాయి ఇవ్వలేదన్నారు. ఎన్నికల కోసం గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ నాయకులను మహిళలు నిలదీయాలని పిలుపునిచ్చారు. పాకాలకు గోదావరి జలాలతో పాటు మంగళవారిపేట గిరిజన రైతుల పోడు భూములకు పట్టాలిచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. తాను ఖానాపురం, చెన్నారావుపేట మండలాల అభివృద్ధి కోసం మంజూరు చేయించిన కోట్లాది నిధులను ప్రస్తుత ఎమ్మెల్యే వాపస్ పంపించాడన్నారు.

### స్థానిక ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలి

స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ నాయకులు కలిసికట్టుగా పనిచేసి గ్రామగ్రామాన గులాబీ జెండా ఎగురవేయాలని పెద్ది పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఎవరికి అవకాశమిచ్చినా అందరూ ఏకతాటిపై పనిచేయాలన్నారు. ప్రజాస్పందన బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉందని, మెజారిటీ స్థానాలను పార్టీ కైవసం చేసుకునేలా కార్యకర్తలు కృషిచేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని, అప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య, సొసైటీ చైర్మన్ రామస్వామినాయక్, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మస్తాన్, మౌలానా, అజహర్, కోరె సుధాకర్, బాబురావు, జాటోత్ బాలు, గుగులోత్ బాలు, ప్రవీణ్‌కుమార్, సునీత, సంపత్, కుమారస్వామి, యువరాజు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీకి చిక్కిన విద్యుత్ ఎస్ఈ

**రూ. 80 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన నరేశ్**



పట్టుబడిన విద్యుత్ శాఖ ఎస్ఈ నరేశ్

మహబూబాబాద్ రూరల్, జూన్ 18 : ఏసీబీ వలకు విద్యుత్ ఏఈ చిక్కాడు. కాంట్రాక్టర్ నుంచి రూ. 80 వేలు లంచం తీసుకుంటూ మహబూబాబాద్ జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ నరేశ్ బుధవారం తన నివాసంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఈ ఘటనపై వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య వివరాలు మీడియాకు వెల్లడించారు. జిల్లాలో 2024–25 సంవత్సరానికి మరిపెడ, కురవి మండలాల్లో ఎలక్ట్రికల్ మెయింటనెన్స్, రిపేర్‌కు సంబంధించి వర్క్స్‌కు టెండర్లు పిలవగా, జిల్లాకు చెందిన ఓ కాంట్రాక్టర్‌కు వచ్చింది. అతనికి రూ. 20 లక్షల వరకు వర్క్స్ చేసేందుకు లిమిట్ ఉందని, ఇంకా కంటిన్యూయేషన్ వర్క్స్ ఉందని, దాని కోసం సంబంధిత ఏఈ, డీఈలు అనుమతి ఇచ్చారు. ఫైల్ ఎస్ఈ నరేశ్ దగ్గర ఉందని సమాచారంతో అతడిని కాంట్రాక్టర్ కలవగా రూ. లక్ష డిమాండ్ చేశాడు. ఈ నెల 14న కాంట్రాక్టర్ ఎస్ఈ నరేశ్‌కు రూ. 20 వేలు ఇచ్చి పని అనుమతి ఇవ్వాలని బ్రతిమిలాడినా నరేశ్ వినలేదు. మిగతా రూ. 80 వేలు ఇస్తేనే అనుమతిస్తానని కరాఖండిగా చెప్పాడు. కాంట్రాక్టర్‌కు లంచం ఇవ్వడం ఇష్టం లేక వరంగల్ ఏసీబీ అధికారులను సంప్రదించాడు. బుధవారం ఉదయం కాంట్రాక్టర్ ఎస్ఈ నరేశ్‌కు రూ. 80 వేలు లంచం ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. ఎస్ఈ నరేశ్‌ని అదుపులోకి తీసుకున్నామని, గురువారం వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏసీబీ సీఐలు ఎల్ రాజు, ఎస్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

---

## మావోయిస్టు చర్చల ప్రతినిధుల్లో నేలరాలిన ఆఖరి నక్షత్రం



యువకునిగా ఉన్నప్పుడు మిత్రులతో గాజర్ల రవి

మావోయిస్టు చర్చల ప్రతినిధి బృందంలో ఆఖరి 'చుక్క' రాలిపోయింది. 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మావోయిస్టులతో చర్చల సందర్భంగా నల్లమల అటవీ ప్రాంతంలోని చిన్నదోర్నాలలో ఆవిష్కృతమైన దృశ్యాన్ని వెలిశాల గ్రామస్థులు గుర్తుచేసుకున్నారు. మావోయిస్టుల నుంచి చర్చల్లో పాల్గొన్న రామకృష్ణ(ఆర్కే), సుధాకర్, గణేశ్. ఈ ముగ్గురు ఆలీవ్‌గ్రీన్ దుస్తులు కాకుండా సివిల్ డ్రెస్‌ల్లో వచ్చారని తెల్లచొక్కా, బూడిద రంగు ప్యాంటు, తలపైన మెరుస్తున్న నక్షత్రపు టోపీ ధరించారని, 'చాలా ఏండ్ల తరువాత అప్పుడే 'మా రవిని చూశామని వెలిశాల గ్రామస్థులు నాడు టీవీల్లో చూసిన సన్నివేశాన్ని వివరించారు. చర్చలకు వచ్చిన మావోయిస్టు ముగ్గురిలో అనారోగ్య కారణాలతో ఆర్కే మరణించగా ఇటీవలే సుధాకర్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. తాజాగా, బుధవారం మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌లో గాజర్ల రవి హతం కావటంతో ఆ చర్చల్లో మావోయిస్టుల నుంచి ప్రాతినిధ్యం వహించిన ముగ్గురూ మృతి చెందటం గమనార్హం. కాగా, జనశక్తి పార్టీ నుంచి చర్చల్లో పాల్గొన్న ఇద్దరిలో రియాజ్ ఎన్‌కౌంటర్‌లో హతం అయ్యారు. మొత్తానికి అటు మావోయిస్టులు, ఇటు జనశక్తి నక్సల్స్‌ల్లో మొత్తం ఐదుగురు చర్చల్లో పాల్గొనగా వారిలో నలుగురూ మృతి చెందారు.



వెలిశాల గ్రామ వ్యూ

- హతమైన మావోయిస్టు ఆఖరి చర్చల నక్షత్రం
- భార్య సైతం గతంలోనే ఎన్‌కౌంటర్‌లో మృతి
- కడచూపు కోసం ఎదురుచూపులు
- అనేక జ్ఞాపకాలతో రంపచోడవరం వెళ్లిన కుటుంబం



*వెలిశాలలో పొడిసిన ఎర్రపొద్దు మారేడుమిల్లిలో గూకింది. మావోయిస్టు ఉద్యమ ప్రస్థానంలో గాజర్ల కుటుంబ ఆఖరి చుక్క తెగిపడింది. మావోయిస్టు ఉద్యమానికి ఊపిరిపోసిన వెలిశాల నుంచి తుపాకీతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందంటూ అడవిబాట పట్టిన గాజర్ల రవి అలియాస్ గణేశ్ అలియాస్ ఉదయ్ 33 ఏళ్ల ప్రస్థానం ముగిసింది. బుధవారం ఉదయం ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో రవి అస్తమించాడని తెలిసి వెలిశాల తల్లడిల్లింది. గణేశ్ ఎన్‌కౌంటర్ విషయాన్ని ఎవరూ నమ్మలేదు. ఇలాంటి ఎన్‌కౌంటర్ పుకార్లు అనేకం విన్నాం..ఇదీ అలాంటిదేనని వెలిశాల నమ్మలేదు. భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌కరే సమాచారంతో గాజర్ల కుటుంబం విశాఖపట్నం బయలుదేరటంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. వెలిశాలతోపాటు ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా గాజర్ల కుటుంబ ఉద్యమప్రస్థానంపై విస్తృత చర్చ సాగుతున్నది. గాజర్ల రవి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు, రవి చిన్ననాటి స్నేహితులు వారి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఇటీవల ఎన్‌కౌంటర్‌లో హతమైన మావోయిస్టు సుప్రీం కమాండర్ నంబాల కేశవరావు మృతదేహాన్నే కుటుంబ సభ్యులకు ఇవ్వలేదు. ఇప్పుడు రవి మృతదేహాన్నైనా ఇస్తారా? లేదా? అని వెలిశాల ఎదురుచూస్తున్నది.*

*- జయశంకర్ భూపాలపల్లి, జూన్ 18 (నమస్తేతెలంగాణ)/ టేకుమట్ల/ సుబేదారి*

# నేలరాలిన


## ముగిసిన గాజర్ల గణేశ్ 33 ఏళ్ల ప్రస్థానం

# వెలిశాల వేగుచుక్క

## మారేడుమిల్లి అడవుల్లో అస్తమించిన రవి

### వెలిశాల నుంచి ఏవోబీ దాకా

గాజర్ల రవి అలియాస్ గణేశ్ అలియాస్ ఉదయ్ విద్యార్థి దశలో విప్లవ రాజకీయాల పట్ల ఆకర్షితులై ఆర్ఎస్‌యూలో చేరారు. 1984 వరకు వెలిశాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి వరకు చదివి 1985లో హన్మకొండలో ఐటీఐ కోర్సులో చేరారు. ఐటీఐలో చదవుతూ ఆర్ఎస్‌యూలో కీలకంగా పనిచేశాడు. తను చదువుతున్న విద్యాలయంపై ఎర్ర జెండా ఎగురవేశారు. పోలీసులు ఆయన అరెస్టు చేశారు. ఐటీఐ అనంతరం వరంగల్‌లోని వివేకానంద కాలేజీలో ఇంటర్ చేశారు. ఆ సమయంలో రైతు కూలీ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులుగా పనిచేశాడు. వెలిశాల నీటి సంఘం ఎన్నికల్లో రవి సోదరుడు గాజర్ల సారయ్య పోటీ చేసి ఓటమి పాలయ్యారు. దన ఓటమికి అగ్రవర్ణ ఆధిపత్యమే కారణమని భావించిన సారయ్య అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. తన అన్న సారయ్య బాటలో గాజర్ల రవి 1991లో అడవిబాట బట్టారు. రవి సుదీర్ఘ కాలం ఉత్తర తెలంగాణ ప్రాంతంలో పని చేశారు. 1994లో మహదేవపూర్ ఏరియా కమిటీ కార్యదర్శిగా వ్యవహరించారు. ఆ సమయంలో మహదేవ్‌పూర్‌లోని లెంకలగడ్డ వద్ద మందుపాతర పేల్చిన ఘటనతో రవి సంచలనం రేపారు. ఉత్తర తెలంగాణలో జరిగిన అనేక ఎన్‌కౌంటర్ల నుంచి గణేశ్ తప్పించుకున్నదాఖలాలున్నాయని పోలీసు వర్గాల రికార్డు. మావోయిస్టు పార్టీ నార్త్ తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ (ఎన్‌టీజెడ్‌సీ) ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. కేకేడబ్ల్యూ కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా పనిచేసి అక్కడి నుంచి ఏఓబీకి వెళ్లిపోయారు. ఏవోబీ కార్యదర్శిగా, సెంట్రల్ కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్న క్రమంలో అల్లూరి జిల్లాలో ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు.



ఎన్‌కౌంటర్ వార్త తెలియగానే సమవేశమై చర్చించుకుంటున్న రవి అన్న తమ్ముడు, కుటుంబ సభ్యులు

## అడవిబాట పట్టిన అన్నదమ్ములు



వెలిశాలలో గాజర్ల కుటుంబం నిర్మించుకుంటున్న ఇల్లు

మావోయిస్టు ఉద్యమంలో వెలిగిన వెలిశాల చిన్నబోయింది. ఒకే కుటుంబం నుంచి ముగ్గురు అన్నదమ్ములు అడవిబాట పట్టిన అరుదైన చరిత్ర వెలిశాలది. ఆ ముగ్గురు అన్నదమ్ములను స్ఫూర్తిగా తీసుకొని వెలిశాల చుట్టుమట్టు గ్రామాల నుంచి ఎంతో మంది గాజర్లసోదరులు తొక్కిన ఎర్ర బాటలో విప్లవపూలు పూయించారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా వెలిశాల అటు మావోయిస్టులకు, ఇటు పోలీసులకు మధ్య నిత్యం రగిలేపేరే. దేశంలో ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా వెలిశాల గుండెలో రాయిపడ్డట్టే అవుతుంది. గాజర్ల సారయ్య అలియాస్ ఆజాద్, గాజర్ల రవి అలియాస్ గణేశ్ అలియాస్ ఉదయ్, గాజర్ల అశోక్ అలియాస్ ఐతు ఇలా ఒకే కుటుంబం నుంచి ముగ్గురు అన్నదమ్ములు నక్సల్స్ ఉద్యమంలోకి వెళ్లారు. బుధవారం అల్లూరి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో గాజర్ల రవి అలియాస్ గణేశ్ హతం కావడంతో ఆ కుటుంబానికి మావోయిస్టు ఉద్యమ ప్రస్థానం ముగిసింది. వెలిశాల గ్రామానికి చెందిన గాజర్ల కనకమ్మ, మల్లయ్య దంపతులకు గాజర్ల రాజయ్య, గాజర్ల సమ్మయ్య, గాజర్ల సారయ్య, గాజర్ల రవి, గాజర్ల అశోక్ అనే ఐదుగురు సంతానం. గాజర్ల రాజయ్య గ్రామంలో గీత కార్మికునిగా పని చేస్తూ అనారోగ్యంతో మృతి చెందాడు. గాజర్ల సమ్మయ్య మంచిర్యాలలో సింగరేణి ఉద్యోగం చేసి పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం హన్మకొండలో నివసిస్తున్నాడు. గ్రామంలో నెలకొన్న ఆధిపత్య ప్రభావంతో గాజర్ల సారయ్య 1990లో నాటి పీపుల్స్‌వార్ ఉద్యమంలో చేరారు. కేంద్ర కమిటీ సభ్యునిగా ఎదిగిన సారయ్య 2008లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. గాజర్ల రవి 1991లో గాజర్ల రవి తనఅన్న దారిలో నడిచి అజ్ఞాతంలోకి వెళ్లారు. కొంతకాలానికి జిలానీబేగం అనే దళసభ్యురాలిని పెండ్లి చేసుకున్నాడు. ఆమె 2017లో ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. గాజర్ల సోదరుల్లో ఒకరైన గాజర్ల అశోక్ అలియాస్ ఐతు మావోయిస్టు ఉద్యమంలో చేరి మహారాష్ట్ర రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎదిగారు. అనారోగ్య కారణాల రీత్యా ఆయన పార్టీలో 2017లో తన భార్య ఉమ (అజ్ఞాతంలోనే పెండ్లి )తో పోలీసుల ఎదుట లొంగిపోయారు. ప్రస్తుతం అశోక్ కాంగ్రెస్ పార్టీలో రాష్ట్ర అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు.

### వెలిశాల నుంచి ఎందరో..

వెలిశాలకు చెందిన గాజర్ల సారయ్య అలియాస్ ఆజాద్, గాజర్ల రవి అలియాస్ గణేశ్, గాజర్ల అశోక్ అలియాస్ ఐతులు అజ్ఞాత బాట పట్టగా వారి వెంట గ్రామానికి చెందిన గంధం చుక్కయ్య, బండి కిష్టస్వామి, గాజర్ల రమేశ్ అలియాస్ నవీన్ సహా ఎంతో మంది అడవిబాట పట్టారు. అలా వెళ్లిన వారిలో గంధం చుక్కయ్య లొంగిపోగా బండి కిష్టస్వామి ఆయన భార్య హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారనే విషయం తెలుసుకున్న పోలీసులు అరెస్టు చేశారు. అలాగే, గాజర్ల రమేశ్ అలియాస్ నవీన్ లాదెళ్ల ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. వెలిశాలను ఆనుకొని ఉన్న రామకృష్టాపూర్‌కు చెందిన ఎడ్ల చేరాలు, పిట్టల రఘు, ఆకునూరి శ్యాం, ఆకునూరి భాగ్య సహ మరొకరు ఉద్యమంలోకి వెళ్లారు. వీరిలో పిట్టల రఘు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందగా మిగిలినవారు లొంగిపోయారు. వెలిశాల, రామకృష్టాపూర్ చుట్టు పక్క గ్రామాల్లో అనేక మంది ఉద్యమబాట పట్టారు.

### మా రవన్నకు ఏమీ కాదు..!

ఎన్‌కౌంటర్ వార్త తెలియగానే వెలిశాల గ్రామస్తులు మధ్యాహ్నం వరకూ నమ్మలేదు. మా రవన్నకు ఏమీ కాదు, ఇదివరకు అలాగే అన్నారు. తప్పకుండా బతికే ఉంటాడని ధీమాగా ఉన్నారు. కానీ మధ్యాహ్నం వరకు రవి కుటుంబ సభ్యులకు భూపాలపల్లి ఎస్పీ నుంచి సమాచారం రావడంతో వారు హుటాహుటిన ఆంధ్రాలోని రంపచోడవరం బయల్దేరారు. అయ్యో బిడ్డా అంటు వెలిశాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తల్లడిల్లారు. చిన్నప్పటి నుంచి తిరిగిన స్నేహితులు, గ్రామస్తులు, వెలిశాల ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న స్నేహితులు తమతో ఉన్న జ్ఞాపకాలను తలుచుకుంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. యుక్త వయసులోనే సేవాభావంతో ఉండే వ్యక్తి అని, ఉద్యమంతోనే తాను ప్రజలకు న్యాయం చేస్తానని చెప్పి 1992లో ఆడవి బాట పట్టి నేడు తుపాకీ తూటాలకు బలై 33 ఏళ్ల తర్వాత విగతజీవిగా వెలిశాలకు వస్తున్నావా రవన్న అంటూ తోటి స్నేహితులు కన్నీళ్లు దిగమింగుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శవాన్ని అయినా ఇస్తారో, ఇవ్వరో కడసారి చూపైనా చూడాలంటూ గ్రామస్తులు ఆశతో ఎదురుసున్నారు.



వెలిశాలలో గుమిగూడి చర్చించుకుంటున్న గ్రామస్తులు

### రంపచోడవరం తరలిన కుటుంబసభ్యులు

మారేడుమిల్లిలో ఎన్‌కౌంటర్‌లో హతమైన గాజర్ల రవి మృతదేహం కోసం ఆయన కుటుంబ సభ్యులు హన్మకొండలోని సమ్మయ్య ఇంట్లో, తమ్ముడు అశోక్(ఐతు), మరో అన్న గాజర్ల సారయ్య (ఆజాద్) కొడుకు కుమారు నవీన్ ఇతర కుటుంబ సభ్యులు కలుసుకున్నారు. భూపాలపల్లి ఎస్పీ కిరణ్ కరే నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా రంపచోడవరం బయలుదేరారు.

### సమాజానికి ఏదైనా చేయాలనేటోడు..



రవి మొదటి నుంచి సేవా గుణం ఉన్నోడు. తనకు ఉన్న దాంట్లో స్నేహితులకు ఇచ్చేవాడు. హన్మకొండలో చదుకునేటప్పుటు ఒకే రూమ్‌లో ఉన్నం. తినడానాకి కావల్సినవి అన్ని ఆయనే తెచ్చిచ్చేవాడు. సినిమాలకు తీసుకెళ్లేటోడు. ఎంత మృధు స్వభావంతో ఉండేవాడో..తప్పు చేస్తే ఫ్రెండ్ అయినా సరే సీరియస్ అయ్యేవాడు.

*– ఎండీ కమ్రోద్దీన్ వెలిశాల. రవి మిత్రుడు, రూమ్‌మేట్*

# ఉలిక్కిపడ్డ ఓరుగల్లు

### ఒక్కొక్కరుగా నేలకొరుగుతున్న అగ్రనేతలు

ఓరుగల్లు ఉలిక్కిపడింది. దేశంలో ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా తనకే తూటాగాయం అవుతుందని తల్లడిల్లింది. బుధవారం మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌లో రవి హతమైన విషయం తెలిసి ఉమ్మడి వరంగల్ ఉలిక్కిపడింది. మొదటినుంచీ మావోయిస్టు ఉద్యమానికి పెట్టనికోటగా ఉన్న ఓరుగల్లు పోరు శిఖరాలు ఒక్కరొక్కరుగా నేలకొరుగుతున్నారని అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నది. నాటి పీపుల్స్‌వార్ ఉద్యమం నుంచి నేటి మావోయిస్ట్ రూపాంతరం దాకా, ప్రభుత్వం జరిపిన చర్చల్లో భాగస్వామి అయిన గాజర్ల రవి హతం కావటం నిజం కాదేమోనని మొదట భావించినా పోలీసులు ధృవీకరించటంతో కన్నీళ్ల పర్యంతం అవుతున్నది. మావోయిస్టు ఉద్యమంలో మొదటినుంచీ ఇక్కడి ఎంతోమంది కీలకస్థానాల్లో ఉన్నారు.



వెలిశాలలో నిర్మించిన గాజర్ల రమేశ్ అలియస్ నవీన్ స్మారక స్తూపం

### అజ్ఞాతసూరీలెందరో

ఉమ్మడి జిల్లాకు చెందిన ఎంతోమంది అజ్ఞాతలో ఉన్నారని పోలీసు రికార్డులు(ఏడాదిన్నర క్రితం) చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లా నుంచి మావోయిస్ట్ పార్టీలో ఇంకా 42 మంది ఉన్నారు. వీరిలో దండకారణ్యంలో 10మంది కీలక పదవుల్లో ఉన్నారు. వరంగల్, హనుమకొండ నుంచి 16మంది, జయశంకర్ భూపాలపల్లి 13, ములుగు 10, మహబుబాబాద్‌లో ముగ్గురు, జనగామ నుంచి ఒకరు ఉన్నారు. వారిలో ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేట శివారు పోలేపల్లికి చెందిన తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న దండకారణ్యం స్పెషల్ జోన్ మిలీషియా కమిటీకి నాయకత్వం వహిస్తున్నారు. తాడ్వాయి మండలం కాల్వపల్లికి చెందిన బడే చొక్కారావు అలియాస్ దామోదర్ రాష్ట్ర కార్యదర్శిగా, గోవిందరావుపేట మండలం మొద్దులగూడేనికి చెందిన కొయ్యాడ సాంబయ్య అలియాస్ ఆజాద్, కన్నాయిగూడెం నుంచి సోనీ, రాంచంద్రాపూర్ నుంచి కనుకుంట్ల రాజు అలియాస్ స్వామి, పంబాపూర్ నుంచి మచ్చ సమ్మయ్య అలియాస్ సతీశ్, మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం బోరుబండ నుంచి కర్రె వెంకట్‌రెడ్డి, జనగామ జిల్లా నుంచి పరమానందరెడ్డి అలియాస్ శ్యాం, వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన ఉల్లెంగుల యాకయ్య అలియాస్ అంజన్నతో పాటు మరికొందరు దండకారణ్యం, ఏవోబీ సరిహద్దుల్లో పలు కీలకస్థానాల్లో కొనసాగుతున్నట్టు పోలీసు రికార్డులు చెబుతున్నాయి.

### ఏడాదిన్నర కాలంలో 9మంది కీలక నేతలు

ఏడాదిన్నర కాలంలో ఉమ్మడి జిల్లాకు చెందిన 9 మంది కీలక నేతలు హతమయ్యారు. మావోయిస్టు పార్టీలో దండకారణ్యం, ఏవోబీలో నాయకత్వం వహిస్తున్న వారిలో వరంగల్‌వారే ఎక్కువగా ఉంటారని పోలీసు రికార్డులు చెబుతున్నాయి. నార్త్‌బస్తర్ డివిజన్ ఇన్‌చార్జి భూపాలపల్లి జిల్లా చిట్యాల చల్లగరిగెకు చెందిన సిరిపెల్లి సుధాకర్ అలియాస్ శంకర్‌రావు, కాటారం మండలం అంకుశాపురానికి చెందిన నార్త్ బస్తర్ నేత సతీశ్ అలియాస్ సాగర్, హనుమకొండ జిల్లా కాజీపేట మండలం టేకులగూడేనికి చెందిన దండకారణ్యం స్పెషల్ జోన్ కీలక నేత మాచర్ల ఏసోబు అలియాస్ రణధీర్, ఇదే మండలం తరాలపల్లికి చెందిన చెందిన ఏవోవీ ప్రాంతాల కీలక నేత ముప్పిడి సారయ్య అలియాస్ సుదర్శన్, బుద్దారానికి చెందిన అశోక్, దేవరుప్పుల మండలం కడవెండి గ్రామానికి చెందిన రేణుక, మావోయిస్టు సుప్రీం కమాండర్ నంబాల కేశవరావుకు గార్డ్‌గా పనిచేసిన చింతగట్టుకు చెందిన రాకేశ్, ములుగు జిల్లా ఏటూరు గ్రామానికి చెందిన డాక్టర్ రవి, తాజాగా బుధవారం గాజర్ల రవి అలియాస్ ఉదయ్.